# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 183
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
ఏప్రిల్ 18, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## అభినందన సభ అదిరింది

- వనం వెంకటేశ్వరరావుకు ఘన సన్మానం
- పాల్గొన్న ప్రముఖులు, ఉపాధ్యాయులు



వివరాలు2లో..

# బీజేపీ మూడు ముక్కలు

## పర్వతగిరిలో వర్గ పోరు

భారతీయ జనతా పార్టీ మూడు ముక్కలైంది. సంస్థాగత కార్యక్రమాల్లోనూ ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తూ పార్టీ పరువును మంటగలుపుతున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి పాటు పడాల్సిన నేతలు ప్రజల్లో పార్టీని పలుచన చేస్తున్నారు. బీజేపీ అధిష్ఠానం పిలుపు మేరకు మండలంలో చేపడుతున్న కార్యక్రమాల్లోనూ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు నాయకులు ఘర్షణలకు దిగుతూ పార్టీ పరువును రోడ్డున పడేస్తున్నారు. ఇటీవల జరిగిన అంబేద్కర్ జయంతి రోజు కూడా మూడు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారు నివాళులర్పించారు. పార్టీలో విభేదాల కారణంగా చాలా కాలం నుంచి మండల అధ్యక్షుడి ఎన్నికను వాయిదా వేస్తూ వస్తున్న జిల్లా నాయకత్వం దీని వల్ల పార్టీకి జరుగుతున్న నష్టాన్ని మాత్రం గ్రహించడం లేదు. అయితే త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పార్టీ నేతలు మూడు గ్రూపులుగా విడిపోవడం ద్వారా రానున్న రోజుల్లో బీజేపీకి తీవ్ర నష్టం ఏర్పడే ప్రమాదముందని అసలైన పార్టీ వాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా వరంగల్ జిల్లా పరిధిలోని పర్వతగిరి మండలంలో నెలకొంది. ఇప్పటికైనా బీజేపీ నాయకత్వం పర్వతగిరిపై దృష్టి సారించి ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా మండల కమిటీని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-వరంగల్ వాయిస్, పర్వతగిరి







- మండల అధ్యక్ష పదవిపై రగడ
- సంస్థాగత కార్యక్రమాల్లోనూ ఎవరి దారి వారిదే
- పార్టీ పరువు తీస్తున్నారంటూ మండిపాటు



## ఘనంగా శ్రీ చక్ర వార్షికోత్సవం

నగరంలోని 32వ డివిజన్ శిరంగి రాజారాం తోటలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ చక్ర వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం ఏడు గంటలకు అభిషేకం, పూల అర్చన కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన పూజారి పాలకుర్తి ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల వీరాంజనేయ, సాయి బాబా దేవస్థానాల కమిటీ అధ్యక్షుడు ఊరుగొండ సతీష్, పోరండ్ల ఓం ప్రకాష్-విజయలక్ష్మి దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి కృపకు పాత్రులైనారు.

-వరంగల్ వాయిస్, కరీమాబాద్



2లో..

## పేదవాడి కన్నీరు తుడిచేందుకే భూభారతి

- పార్ట్-బిలో 7 లక్షలు ఎకరాలకు పరిష్కారం చూపిస్తాం
- గిరిజన ప్రాంత సమస్యలపై కమిటీ ఏర్పాటు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



8లో..

## శాంతియుత సమాజం స్థాపించాలి

- కమ్యూనిటీ పెద్దలు ఆ బాధ్యత తీసుకోవాలి
- హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్



మండల పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరుకాని మండలాధ్యక్షుడు

# బీజేపీ.. మూడు ముక్కలు

- పర్వతగిరిలో వర్గ పోరు
- మండల అధ్యక్ష పదవిపై రగడ
- సంస్థాగత కార్యక్రమాల్లోనూ ఎవరి దారి వారిదే
- పార్టీ పరువు తీస్తున్నారంటూ మండిపాటు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి మండల బీజేపీలో వర్గ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. రాష్ట్ర పార్టీ మార్గదర్శకాల్లో భాగంగా జిల్లాలో చేపడుతున్న కార్యకలాపాల్లో స్థానిక మండల అధ్యక్షుడు పాల్గొనకపోవడంతోపాటు తనే సొంతంగా ఇతర నాయకులతో కలిసి పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం ఈ సంక్షోభానికి దారితీసింది. అయితే అధ్యక్షుడి అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మరోవైపు, అధ్యక్షుడు పార్టీ బాధ్యతల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అభిప్రాయపడుతున్న వర్గం, తనదైన శైలిలో కార్యకలాపాలు కొనసాగిస్తోంది. దీంతో పార్టీ నేతల మధ్య మనస్పర్థలు రచ్చకెక్కాయి.

### ఏర్పడిన మూడవ వర్గం..

ఇప్పటికే పర్వతగిరి మండల పరిధిలోని బీజేపీ రెండు వర్గాలు చీలిపోయి ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తుంటే.. మరో వర్గం తెరమీదికి వచ్చింది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన కొంతమంది నేతలు మూడో వర్గంగా ఏర్పడి, పార్టీ అధ్యక్ష పదవిని దక్కించుకునేలా ప్రయత్నాలు ప్రారంభించడంతో పోటీ మరింత ఉత్కంఠగా మారింది. స్థానికంగా తమ అభిమాన నేతలకు రికమండేషన్లు పంపిస్తూ, రాష్ట్ర నాయకత్వాన్ని ఒత్తిడికి గురిచేయాలని భావిస్తున్నారు.

### రాజకీయ గందరగోళం

రాష్ట్ర పార్టీ సూచనల మేరకు మండల అధ్యక్షుడి ఎన్నికను చేపట్టిన సమయంలో పర్వతగిరి మండలంలో నెలకొన్న విభేదాల నేపథ్యంలో ఆ ఎన్నిక వాయిదా పడింది. పాత అధ్యక్షుడిని కొనసాగించాలని కోరుతున్న వర్గం ఒక వైపు ఉండగా, బీజేపీలో కొన్ని సంవత్సరాలుగా ఉంటున్న నేతలు తమవారికే అవకాశం ఇవ్వాలంటూ ప్రయత్నిస్తున్నారు. ఇక మూడో వర్గంగా తెర మీదికి వచ్చిన గ్రూపు, బీజేపీలోకి ఇటీవల చేరిన నేతలు తమ నాయకుని ఆధ్వర్యంలో ముందుకు సాగుతోంది. అయితే పార్టీ కోసం సంవత్సరాలుగా పని చేస్తున్న మేమే ఈ పదవికి అర్హులమంటూ పాత నాయకులు వాదిస్తుంగా, ఇప్పుడు పార్టీకి ప్రజల మద్దతు తెచ్చే శక్తి మాలో ఉంది అంటూ కొత్తవారి వాదన. దీంతో రెండు వర్గాల మధ్య విభేదాలు తారాస్థాయికి పెరుగుతున్నాయి.

### సమన్వయమే మార్గం..

ఈ రాజకీయ సంక్షోభం పర్వతగిరిలో బీజేపీ బలపడటానికి కాకుండా, ప్రజల్లో పార్టీపై నమ్మకాన్ని దెబ్బతీసేలా ఉందన్న వాదన వినిపిస్తోంది. నాయకత్వ స్థాయిలో ఈ వర్గ పోరును సమర్థవంతంగా సమాధానం చేయకపోతే, పార్టీ ప్రభావం స్థానికంగా మరింత తగ్గే ప్రమాదం కనిపిస్తోంది. త్వరలోనే పార్టీ శ్రేణుల మధ్య చర్చలు జరిపి, నాయకత్వ విషయంలో స్పష్టత ఇవ్వాల్సిన అవసరం రాష్ట్ర నాయకత్వానికి ఉందని పార్టీ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

### అధ్యక్ష ఎన్నిక వాయిదా..

బీజేపీ మండల అధ్యక్షుడి ఎన్నికపై రికమండేషన్లు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో జిల్లా పార్టీ మండల అధ్యక్షుడి ఎన్నికలను ప్రారంభించగా, కొన్ని మండలాల్లో ఏర్పడిన గందరగోళ పరిస్థితుల కారణంగా వాటిని వాయిదా వేయాల్సి వచ్చింది. పాత అధ్యక్షుల నియామకాన్ని కొందరు కార్యకర్తలు వ్యతిరేకిస్తూ గొడవకు దిగారు. మరోవైపు, బీఆర్ఎస్ నుంచి కొత్తగా బీజేపీలో చేరిన నాయకులు తామే అధ్యక్ష పదవికి అర్హులమని, తమ నాయకుల నుంచి రికమండేషన్లు తెచ్చుకుంటున్నారు. ఇక పాత అధ్యక్షుడు కూడా తాను తక్కువ కాదంటూ తనకు మద్దతుగా ఉన్న నాయకుల నుంచి రికమండేషన్ పొందుతున్నాడు. అలాగే, గత కొన్ని ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న నేతలు కూడా తాము అధ్యక్ష పదవికి అర్హులమేనంటూ పేర్లు పంపిస్తున్నారు. ఈ పరిస్థితులు మండల స్థాయిలో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి.



## ఘనంగా సూర్యప్రకాశ్ జన్మదిన వేడుకలు

వరంగల్ వాయిస్ న్యూస్ నెట్ వర్క్ ఇంచార్జి, సీనియర్ జర్నలిస్ట్ సామల సూర్యప్రకాశ్ జన్మదిన వేడుకలను శుక్రవారం పత్రిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డెస్క్ ఇంచార్జి గోలి రవి, హనుమకొండ సీనియర్ జర్నలిస్ట్ సిద్దోజు రాకేష్ పాల్గొన్నారు.

–వరంగల్ వాయిస్, హనుమకొండ



## రహదారులు బాగుంటేనే అభివృద్ధి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రహదారులు బాగుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, దీనిని గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టిందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య వెల్లడించారు. నగరంలోని 11వ డివిజన్ షాలిమార్ హోటల్ లైన్ లో శుక్రవారం ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి డాక్టర్ కడియం కావ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లతోపాటు గ్రామాల్లోని ప్రతి గల్లికి సీసీ రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

# పేదవాడి కన్నీరు తుడిచేందుకే భూభారతి

- పార్ట్-బిలో 7 లక్షలు ఎకరాలకు పరిష్కారం చూపిస్తాం
- అబాదీ ఇళ్లకు కూడా డాక్యుమెంట్లు
- గిరిజన ప్రాంత సమస్యలపై కమిటీ ఏర్పాటు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** గత ప్రభుత్వం కుట్ర పూరితంగా పార్ట్ –బిలో పెట్టిన 18 లక్షల ఎకరాలలో ఆరు నుంచి ఏడు లక్షల ఎకరాల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయని ఈ భూములకు భూభారతి చట్టంతో పరిష్కారం చూపిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతి రాజ్ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు బలరాం నాయక్, ప్రిన్సిపాల్ సెక్రటరీ ఫైనాన్స్ రామకృష్ణ రావు, భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట శాసన సభ్యులు నాగరాజు, ప్రిన్సిపాల్ సెక్రటరీ సీసీఎల్ఏ రెవిన్యూ బుద్ధ ప్రకాష్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ లతో భూభారతి పైలెట్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేదల కన్నీటిని తుడిచేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. ఎన్నికలకు ముందు ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని మేము ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించి ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యంగా పనిచేస్తాం అన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా రైతులకు సేవలు అందిస్తాం అన్నారు. రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే చెప్పులు అరిగేలా అధికారుల చుట్టూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగారని ఇప్పుడు ఇంకా ఆ అవసరం రైతులకు లేదని అధికారులే రైతుల వద్దకు వచ్చి వారి భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ధరణిపై గత పాలకులు ఏనాడు కూడా రెవెన్యూ సదస్సు పెట్టలేదని ఒకవేళ రెవెన్యూ సదస్సులు పెట్టి ఉంటే ఆనాడే ఆ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడేవారని, గత పాలకులు చేసిన తప్పులను ఇప్పటికీ గ్రహించడం లేదని వారికి జ్ఞానోదయం కావడం లేదన్నారు. గతంలో రైతులను మోసం చేసే 2020– ధరణి చట్టాన్ని తీసుకువస్తే మేం దానిని బంగాళాఖాతంలోకి విసిరేసి సామాన్య ప్రజల కోసం 2025– భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చామని పేర్కొన్నారు.

మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులందరికీ తల్లి లాంటి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. రైతులు ఎవరూ మధ్యవర్తులు, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆమె వెల్లడించారు. రైతును రాజు చేయాలనే ఉద్దేశంతోనే ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందని పేర్కొన్నారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తల్లికి బిడ్డకు ఎలాంటి సంబంధం ఉంటుందో భూమికి రైతుకు అలాంటి సంబంధం ఉంటుందని, రైతుల సమస్యలను పరిష్కరించడానికే భూ భారతి చట్టం అమలులోకి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చి రైతులు ఆత్మహత్యలకు కారకులు అయ్యారన్నారు. నేడు వారి కన్నీరు తుడిచేందుకు భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. కాస్తులో ఉన్న నిజమైన రైతులకు భూమి హక్కు పత్రాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు పోతున్నదని, భూమి రైతుకు ఆదాయం బలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో ఏఎస్ పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి, డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, రెవెన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి కిరణ్ ప్రకాష్, ఆర్ డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సాంస్కృతిక కళాకారులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం అవసరం

• ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాజ్యాంగాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా "జై భీమ్, జై బాపు, జై సంవిధాన్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. హనుమకొండలోని 49, 50వ డివిజన్ల కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రకాష్ రెడ్డిపేట ఆటో స్టాండ్ జంక్షన్ నుంచి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తైన నేపథ్యంలో ప్రజల్లో రాజ్యాంగ విలువలపై అవగాహన పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. బీజేపీ రాజ్యాంగాన్ని అణగదొక్కే కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, అందరం కలసి పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. బీజేపీ కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులే ముఖ్యం అయిపోయారని చెప్పారు. పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగాన్ని మార్పులకు గురిచేసే యత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం గ్రామాల ప్రతీ ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజమల్లా రెడ్డి, మహమ్మద్ అఫ్సర్, కార్పొరేటర్లు నెక్కొండ కవిత కిషన్, ఇనుగుల మానసా రాంప్రసాద్, కో–ఆర్డినేటర్లు నాయిని లక్ష్మా రెడ్డి, బండారి జనార్ధన్ గౌడ్, దొంతి తిరుపతి రెడ్డి, మహమ్మద్ బషీర్, మహమ్మద్ ఫయ్యాజ్, మాజిద్ మిర్జా, రాము, దివ్య, సునీత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం ...

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం వరంగల్ 11వ డివిజన్ లో ఎంపీ ల్యాడ్ నిధులతో రూ.15 లక్షలతో రంగంపేట సీసీ రోడ్డు నిర్మాణానికి వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్యతో కలిసి శంకుస్థాపన శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని చెప్పిన ప్రతి హామీ అమలు చేసే తీరుతామని అన్నారు. డివిజన్ లోని ప్రతి వార్డులో రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైన్ ను నిర్మాణం చేపడుతామని అన్నారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని, మంజూరు చేసిన పనులను నిర్ణీత సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అభివృద్ధి సంక్షేమమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం సమ పాళ్లలో సాగుతుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందు వెళ్తుందని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రహదారులు బాగుంటేనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి గ్రామానికి రహదారులు ఏర్పాటు చేయుటకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గన్నారపు సంగీత్ కుమార్, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, నాయకులు మహమ్మద్ సమద్, సయ్యద్ అజ్జర్, మాడిశెట్టి రాజ్ కుమార్, గద్దల శివ ప్రసాద్, గన్నారపు కమల్, రమేష్, క్రాంతి, పవన్, మాలతి, సుభద్ర, మహేష్, నిర్మల, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు




ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి గడిచిన 16 నెలల వ్యవధిలో అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని పలు పథకాలను అమలు చేస్తోందని శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. శాయంపేట మండలంలోని రైతు వేదికలో తహసీల్దార్ సత్యనారాయణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్ఆర్ కళ్యాణ లక్ష్మి పథకం కింద మంజూరైన రూ. 52,60,320 విలువ గల చెక్కులను 52 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా సన్న బియ్యం పంపిణీ చేయడం లేదని, తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధంగా ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించదన్నారు. భూ సమస్యల పరిష్కారానికి నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి ద్వారా రైతులు తహసీల్దార్ కార్యాలయాల నుంచే తమ సమస్యలకు పరిష్కారం పొందగలుగుతారని వెల్లడించారు. గతంలో ధరణి వ్యవస్థ ద్వారా రైతులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణిచంద్ర, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ భాషని చంద్రప్రకాష్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చల్లా చక్రపాణి, వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలి

◆ డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలోని చెరువులో ఫిష్ బండ్ పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు నెల రోజులు కావస్తున్న నేటికి కూలీ వేతనాలు అందించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం దామెర మండలం ల్యాదేళ్ల గ్రామంలో చెరువులో ఫిష్ బండ్ చేస్తున్న కూలీలతో పని వద్ద మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ తో కూలీలు మాట్లాడుతూ కూలీ చేసిన డబ్బులు మాకు నెల రోజులైన రాలేదని, మేము ఏట్లా బ్రతకాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. మండుటెండల్లో కూలీలు పనిచేస్తున్న కూలీలకు పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించకుండ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, కూలీలకు పెడింగ్ వేతనాలు అందించి కూలీల హక్కులను కాపాడలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) చుంచు రాజేందర్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానికంగా గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని వెంటనే ఫిల్డ్ అసిస్టెంట్లకు, ఉపాధి హామీ కూలీలైన హక్కుదారులకు వేతనాలు అందించాలని జిల్లా కలెక్టర్ ను, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై అవగాహన సదస్సు

**వరంగల్ వాయిస్, నడికూడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు మంజూరి, నిర్మాణం గురించి అవగాహన కల్పించేందుకు రేపు మండల కేంద్రంలో రైతు వేదికలో సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి జి విమల తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండల ప్రత్యేక అధికారి బి.నవీన్ అధ్యక్షతన, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శనివారం ఉదయం 10.30 గంటలకు నడికూడ రైతు వేదికలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సమావేశానికి నియోజకవర్గ ప్రత్యేక అధికారి పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ ముఖ్య అతిథిగా హాజరు అవుతారని తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు , పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరు కావలసినదిగా కోరారు. పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామానికి సంబంధించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, ప్రత్యేక అధికారులకు సమాచారం ఇచ్చి వీరందరూ తప్ప కుండా సమావేశానికి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కాళి ప్రసాద్ రావు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలోని జీఎస్సాఆర్ గార్డెన్ లో గూడెప్పాడ్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త బలభద్ర సాయిరాం చెల్లెలు మానస కళ్యాణ్ కృష్ణ వివాహ మహోత్సవానికి బీజేపీ రాష్ట్ర నాయకులు పరకాల కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్. పగడాల కాళి ప్రసాద్ రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షులు ఇర్సండ్ల సదానందం, బీజేవైఎం మండల అధ్యక్షులు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి బండి శ్రావణ్ కుమార్, బూతు అధ్యక్షులు పెండ్యాల సునీల్ రెడ్డి, కాడబోయిన సునీల్, కోరుకొప్పుల ప్రశాంత్, నాయకులు పోరెడ్డి సమ్మిరెడ్డి, రేమిడి కార్తీక్ రెడ్డి, కందకట్ల దిలీప్, సోషల్ మీడియా కన్వీనర్ బలభద్ర దినేష్ శివ, సాయిరాం, ఊకంటి శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా నాయుడు గారి కుండ బిర్యాని రెస్టారెంట్ ప్రారంభం

హాజరైన ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని సుబేదారిలోని నాయుడు గారి కుండ బిర్యాని రెస్టారెంట్ 36వ బ్రాంచ్ ను శుక్రవారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ నిర్వాహకులను ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎంపీ డా.కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించినప్పుడే అందరి మన్ననలు పొందవచ్చునని అన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో భాగంగా వారంలో ఒకసారైనా కుటుంబంతో కలిసి రెస్టారెంట్ కు వస్తారని, వారిని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన రుచికరమైన భోజన సేవలు కల్పించాలన్నారు. అలాగే రెస్టారెంట్ వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, యూత్ కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్, సత్య సాయి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేముల రంజిత్ పాల్గొన్నారు.

# మందకృష్ణ మాదిగను కలిసిన అంబాల రాజు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఉమామహేశ్వర గార్డెన్స్ లో పుల్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన పుల్ల ఫ్యామిలీ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా హాజరైన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిశారు. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ సాధించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



**వరంగల్ వాయిస్, రేగొండ :** రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దామరంచ పల్లి గ్రామానికి చెందిన బండి కుమారస్వామి మండల కేంద్రంలోని రావులపల్లిలో ఉన్న అత్తగారింటికి ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద బస్టాండ్ వద్ద మహాదేవ్ పూర్ నుంచి హనుమకొండ వైపుకు అతి వేగంగా వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న బండి కుమారస్వామికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 వాహనంలో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి ఎస్ఐ ఎన్.సందీప్ కుమార్ చేరుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మైనర్లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన అలాగే, వీరిని ప్రోత్సాహస్తూ వాహనాలు అందజేసిన చట్టపరమైన ఇక్కట్లు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోంది. ముఖ్యంగా తెలిసి తెలియని వయస్సులోని మైనర్లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాల సంఖ్య ఘణనీయంగా పెరిగే అవకాశం వున్నందును ఇలాంటి ప్రమాదాల నివాణకై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కఠిన చర్యలు తీసుకొవడం జరుగుతుందని తెలిపారు. వరంగల్ పోలీస్ కమినరేట్ పరిధిలో గత జనవరి మాసం నుంచి ఇప్పటి వరకు 63 మంది మైనర్లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన సంఘటనల్లో మొత్తం 35278 కేసులు నమోదు చేసి 12552 వాహనాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు వాహనం అందజేసిన వాహన యజమానులకు 16లక్షల47 వేల రూపాయల జరిమాన విధించడం జరిగిందని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఇకనైన తల్లిదండ్రులు, వాహన యజమానులు మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలను అందజేసే చిక్కుల్లో పడవద్దని పోలీస్ కమిషనర్ సూచించారు.

# ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** ఆత్మకూర్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ విశ్వాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందినవారు పాల్గొన్నారు. ఆత్మకూర్‌లోని సెయింట్ థెరిస్సా స్కూల్ ఆవరణంలో ఫాదర్ అల్లం ఇన్నా రెడ్డి ఆధ్వర్యంలో పరిశుద్ధ సిలువ మార్గం ప్రార్థనలు అంకితభావంతో నిర్వహించబడ్డాయి. ప్రపంచ రక్షకుడైన యేసు క్రీస్తు సర్వ మానవ పాప విముక్తి కోసం మరణశిక్షను స్వీకరించిన శుభ శుక్రవారం నాడు, క్రైస్తవులు ఆయన్ను స్మరించుకుంటూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల చేశారు. ఆయన చేసిన త్యాగాన్ని గుర్తుచేస్తూ, స్తోత్రగీతాలతో ఆయనను మహిమ పరిచారు. సిలువ ధ్యానాన్ని పాటిస్తూ, 40 రోజుల ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్న విశ్వాసులు ఈరోజున వాటిని విరమించారు. సంప్రదాయంగా పేదలకు దానాలు చేశారు. ఈ సందర్భంగా చర్చులకు తరలివెళ్లిన వారు పరిశుద్ధ సిలువ మార్గంలోని 14 స్థలాల్లో క్రీస్తు అనుభవించిన కష్టాలను కళాత్మకంగా ప్రదర్శించారు. ప్రభువు మోసిన సిలువ, ఆయన బోధనలు, సందేశాలు, బైబిల్ వాక్యాలను మతపెద్దలు శ్రద్ధగా వివరించారు. గుడ్‌ఫ్రైడే ప్రాధాన్యాన్ని వివరిస్తూ, ఈ పండుగ దేవుడికి మానవునికి, మానవునికి మానవునికి మధ్య ఉన్న ప్రేమను ప్రతిబింబిస్తుందని తెలిపారు. పాపాల నుంచి దూరంగా ఉండి, ప్రేమతో జీవిస్తూ, దేవుని మార్గాన్ని అనుసరించాలని ఉపదేశించారు.

ఈ ప్రార్థనల్లో విశ్వాసులు, సంఘపెద్దలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెంబర్తి వినయ్, సంపత్, మల్లయ్య, రమేష్ బాబు, కోర్నెల్, మహేష్, మనోజ్, కమల్, శ్రీను తదితరులు పాల్గొనడం విశేషం.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గట్లకానిపర్తి, మైలారం, పెద్దకోడేపాక, జోగంపల్లి, కొప్పుల వసంతాపూర్, సూర్యనాయక్ తండా, కాట్రపల్లి, ప్రగతి సింగారం, నేరేడుపల్లి, పత్తిపాక, శాయంపేట వంటి గ్రామాల్లో ఈ కేంద్రాలను గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జి.సత్యనారాయణరావు (జీఎస్సార్) మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులను మాని, నేరుగా ప్రభుత్వ అధీనంలోని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేదని, మిల్లు యజమానులు, కేంద్రాల నిర్వాహకులు రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల కృషికి గౌరవంగా, ప్రతి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ను ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణి చంద్ర, వ్యవసాయ అధికారి గంగా జమున, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి చిందం రవి, మాజీ ఎంపీపీ బాసని చంద్రప్రకాష్, మాజీ జెడ్పిటిసి చల్ల చక్రపాణి, నాయకులు కొమ్ముల భాస్కర్, తడక కుమార్ స్వామి, వైనాల కుమారస్వామి, మారపల్లి కటయ్య, మార్కండేయ, శాంతా రవి తదితరులు పాల్గొన్నారు.

# వరి కోత విధానంపై రైతులకు అవగాహన కల్పించాలి

## ➲ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, నెక్కొండ :** నెక్కొండ మండలం గోట్లకొండ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాయత్రి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రెండు లక్షల రూపాయల వరకు రైతుల రుణాలను ఒకే కాలంలో మాఫీ చేసిన ఘనత సాధించిందన్నారు. వర్షాలు పడే సూచనలు ఉన్నందున ధాన్యం రాశుల వద్ద టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వమే ప్రతి గింజ కొనుగోలు చేస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, వరి కోతలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని, ప్యాడి క్లీనర్ల వినియోగం పూర్తిస్థాయిలో ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఓ కిష్టయ్య, డీఎం సివిల్ సప్లై సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో, డాక్టర్ సత్య శారద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులతో రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై సమీక్షించారు. మండల స్థాయిలో కమిటీ ద్వారా పారదర్శకంగా యూనిట్ల ఎంపిక జరగాలని, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, ఎడీఎస్సీ కార్పొరేషన్ అధికారి సురేష్, మైనారిటీ వెల్ఫేర్ అధికారి రమేష్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సౌజన్య పాల్గొన్నారు.

# విలేజ్ డెవలప్ మెంట్ కమిటీలను నిషేధించాలి




◆ కల్లుగీత కార్మిక సంఘం ప్రజా సంఘాల డిమాండ్

**వరంగల్ వాయిస్, జనగామ :** నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గత ఆరు నెలలుగా కల్లుగీత కార్మికులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన వీడీసీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గౌడ మహిళలను శ్రీరామనవమి సందర్భంగా గుడి నుండి గెంటివేసి,గీత కార్మికులకు ఉపాధి కల్పించే ఈత చెట్లను కాల్చివేసిన దుర్మార్గులను తక్షణమే అరెస్టు చేయాలని, రాజ్యాంగ వ్యతిరేక శక్తులుగా చలామణి అవుతున్న వీడీసీలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ జనగామ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కల్లుగీత కార్మిక సంఘం సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నిజామాబాద్ కామారెడ్డి మహబూబ్ నగర్ తదితర జిల్లాలలో విలేజ్ అభివృద్ధి కమిటీల పేరుతో పెత్తందారులు దోపిడి శక్తులు బలహీనవర్గాల కులవృత్తులను ఆర్థికంగా దోపిడీ చేస్తూ వారి సామాజిక ఆర్థిక రాజకీయ ఎదుగుదలను అణచివేసే పద్ధతులను అవలంబిస్తున్నారని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు తూటి దేవదానం, గడ్డం యాదగిరి, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ షబానా, గిరిజన సంఘం జిల్లా నాయకులు రమావత్ మిత్యానాయక్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు కొలిపాక నరసింహులు, బీజేపీ గీత సెల్ జిల్లా నాయకులు బొమ్మకంటి అనిల్ కుమార్, గోపా జిల్లా కోశాధికారి దూడల రాజా సంపత్, గోపా నాయకులు గోపగోని సుగుణాకర్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మార్క ఉపేందర్, జొన్నగాని శ్రీనివాస్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ సురుగు రాజేష్, తాళ్లపల్లి అంజయ్య, వంగ వెంకటేష్, సీసా శ్రీధర్, చీకట్ల నవీన్, బసవగాని మహేందర్, కొర్రెముల పరుశరాములు, బాల్నే ఉమాపతి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బూడిది ప్రశాంత్, బూడిది సంపత్, నవీన్ పాల్గొన్నారు.

# మందకృష్ణను సత్కరించిన జమ్మికుంట ఏఎంసీ చైర్ పర్సన్



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రంలోని ఉమామహేశ్వర గార్డెన్స్ లో పుల్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన పుల్ల ఫ్యామిలీస్ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా హాజరైన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగను జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ఎస్సీ వర్గీకరణ సాధించిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాల క్రితం రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించి మాదిగ జాతికి విద్య ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లలో జరుగుతున్న అన్యాయాన్ని ఊరు ఊరా.. వాడ వాడన తెలియజేశారన్నారు. మాదిగ జాతి ప్రజలను చైతన్యం చేసి షెడ్యూల్ కులాల ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒప్పించి మెప్పించి రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదింపజేసిన ఘనత మందకృష్ణ మాదిగకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకట్ స్వామి, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గెటి సదానందం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అగ్గలయ్య గుట్టను సందర్శించిన దాస్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అంతర్జాతీయ చారిత్రక కట్టడాల దినోత్సవాన్ని పురస్కరించుకుని, తెలంగాణ ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ శుక్రవారం హనుమకొండలోని పద్మాక్షి గుట్ట పరిధిలో ఉన్న ప్రముఖ చారిత్రక స్థలమైన అగ్గలయ్య గుట్టను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పూర్వీకుల కృషిని ప్రతిబింబించే వారసత్వ సంపదను కాపాడటమే కాదు, భవిష్యత్ తరాలకు అందించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో అగ్గలయ్య గుట్టకు చారిత్రక ప్రాధాన్యతను గుర్తించి, సుమారు రూ.1.5 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గతంలో మరుగునపడిన ఈ ప్రదేశం, ప్రస్తుతం ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోవడం తనకు సంతోషంగా ఉందన్నారు. అగ్గలయ్య గుట్ట చరిత్రను గురించి వివరిస్తూ, పశ్చిమ చాళుక్యులు, కల్యాణి చాళుక్యుల కాలంలో అగ్గలయ్య అనే వైద్య నిపుణుడు సేవలందించినట్లు, ఆయన చేసిన వైద్య పరిశోధనలు ఈ ప్రాంత చరిత్రలో విశేష స్థానం కలిగి ఉన్నాయని వివరించారు. అగ్గలయ్య పేరు మరింత ప్రాచుర్యంలోకి రావాలనే లక్ష్యంతో ఈ అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇదే ప్రాంతంలో ఉన్న జైన సంప్రదాయానికి చెందిన ప్రాచీన జినాలయాలు, విద్యా కేంద్రాలు, వైద్య సేవలకు కేంద్రంగా ఉన్న చారిత్రక ప్రదేశాలను గుర్తించి, తరతరాలుగా గుర్తుండిపోయేలా అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు గండ్రకోట రాకేష్ యాదవ్, పబ్బోజు శ్రీకాంత్ చారి, మూటిక రాజు, బయ్య శోభన్, పులి అర్జున్, రవీందర్, హరికృష్ణ, కొండ బాబు, సమ్మయ్య, జబ్బర్ పాషా, సందీప్ పాల్గొన్నారు.

# దహన సంస్కారాలకు ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, గణపురం:** మండలంలోని నగరంపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన రాసమల్ల మంజుల ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి మృతిచెందారు. అంత్యక్రియలు నిర్వహించడానికి కూడా ఆ కుటుంబానికి అవసరమైన డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం గురించి గ్రామ యువత ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్‌ను సంప్రదించగా, వెంటనే స్పందించిన ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి మంజుల కుటుంబానికి రూ.3,000 ఆర్థిక సహాయాన్ని పంపించారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గణపురం మండల అధ్యక్షుడు వడ్ల యాదగిరి, ప్రధాన కార్యదర్శి మహబూబ్ పాషా, సభ్యులు మేకల ఓంకార్ పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ కో చైర్మన్ గా ఊట్కూరి అశోక్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, ఫోర్త్ క్లాస్ ఉద్యోగుల, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీకి అనుబంధంగా వరంగల్ జిల్లాలో కూడా ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం రాత్రి 8 గంటలకు టీఎన్జీవో భవన్ లో (టీజీఈజేఏసీ) జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీ కో చైర్మన్ గా టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది . ఈ సందర్భంగా టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ అశోక్ కు అభినందనలు తెలియజేశారు. కో చైర్మన్ గా ఎన్నికైన అశోక్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని దీర్ఘకాలంగా అపరిశ్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# బాధిత కుటుంబాలకు చల్లా పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన వాంకే రాజేశ్వరరావు, దుప్పటి శ్రీదేవి కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం వారి మృతి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు దురిశెట్టి చంద్రమౌళి, నడికూడ గ్రామ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మి గణపతి సంఘం సేవలు అభినందనీయం

## సీనియర్ జర్నలిస్ట్ సామల సూర్య ప్రకాష్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని కాశిబుగ్గ చౌరస్తాలో శుక్రవారం 15వ రోజు లక్ష్మి గణపతి పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్ర వద్ద కూరపాటి రాజేశ్వరరావు వారి సతీమణి రోజా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ వాయిస్ న్యూస్ నెట్ వర్క్ ఇంచార్జ్ సామల సూర్య ప్రకాష్ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సామాజిక సేవ చేయడం గొప్ప వరమని లక్ష్మి గణపతి సంఘం సేవలు అద్భుతమని వారు కితాబునిచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మి గణపతి పరపతి సంఘం కార్యవర్గం సూర్యప్రకాష్ ను శాలువాతో ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో లక్ష్మి గణపతి పరపతి సంఘం అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్, కోశాధికారి దుస్సా కృష్ణ, సహాయ కార్యదర్శి పసునూటి శ్రీకాంత్, మండల చంద్రశేఖర్, గౌరవ సలహాదారులు వంగరి రవి, కార్యవర్గ సభ్యులు బండారి లక్ష్మణ్, గాజుల రాజేష్, కూరపాటి సతీష్, వంగ ఐలయ్య, కోట నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న ఫోన్లు బాధితులకు అప్పగింత



**వరంగల్ వాయిస్, చిట్యాల:** పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను శుక్రవారం చిట్యాల పోలీసులు బాధితులకు అప్పగించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని జూకల్ గ్రామానికి చెందిన సిరిగిరి రవీందర్ రెండు నెలల క్రితం తన ఒప్పో మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అలాగే, వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన ఉప్పుల రవీందర్ నెల క్రితం తన రెడ్‌మీ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ ఇద్దరూ చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు నమోదు చేయగా, సీఈఐఆర్ (CEIR) పోర్టల్ ద్వారా పోలీసులు ఫోన్లను గుర్తించగలిగారు. గుర్తించిన ఫోన్లను చిట్యాల సీఐ డి.మల్లేష్, ఎస్ఐ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో బాధితులకు అందజేశారు. ఈ విభాగంలో కృషిచేసిన కానిస్టేబుల్ లాల్ సింగ్ ను చిట్యాల సీఐ మల్లేష్ ప్రత్యేకంగా అభినందించారు.

# బీఆర్ఎస్ సభ విజయానికి కసరత్తు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** వరంగల్ లో ఈ నెల 27న జరిగే భారత రాష్ట్ర సమితి రథోత్సవ సభను విజయవంతం చేసేందుకు గ్రామ గ్రామాన వాల్ రైటింగ్ తో పాటు ప్రచారం నిర్వహిస్తున్నామని అలాగే ప్రతి మండలం నుంచి 5000 మంది పార్టీ నాయకులు కార్యకర్తలు తరలివస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నేత మాజీ ఎంపీపీ వై కుమార్ గౌడ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ రథోత్సవ సభ కనివిని ఎరుగని రీతిలో జరగనుందని ఆయన తెలిపారు. ఈ సభకు 10 లక్షల మంది రానున్నారని చెప్పారు. దేశంలో తెలంగాణకు గుర్తింపు తెచ్చింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ఆ రెండు పార్టీల నేతలను కార్యకర్తలు నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ ముషిపట్ల విజయ్, సీనియర్ జిల్లా నాయకులు గూడ కిరణ్ కుమార్, ద్యావరా యాకయ్య, లోకుంట్ల సుజన్ కుమార్, బండి కుమార్, దుబ్బాక హరీష్ గౌడ్, మార్కలా మహేందర్ రెడ్డి, కుర్ర రాజేందర్ నాయక్, ముప్పిడి సాంబా, బాల్నే పరుశరామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి




● పీడీఎస్ యూ విద్యార్థి సంఘం డిమాండ్

**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో అన్ని అర్హతలు కలిగి దశాబ్దకాలంగా బోధన కొనసాగిస్తున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయం గెస్ట్ హౌస్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత (పీడీఎస్ యూ) అధ్యక్షుడు బి.బాలకృష్ణ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులకు భద్రతతో కూడిన భవిష్యత్తు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెంబర్ 21 ద్వారా వారి జీవనోపాధిని ప్రశ్నార్థకంగా మార్చిందని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కూడా కాంట్రాక్ట్ అధ్యాపకుల వ్యవస్థను రద్దు చేస్తామన్న వాగ్దానం చేసి దశాబ్దకాలంగా అదే విధంగా వారిని వినియోగించుకుందని, ఇప్పుడు అదే బాటలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టి వేస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను రెగ్యులర్ పద్ధతిలో భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్య పూరిత, నిరంకుశ వైఖరిని తక్షణం విడనాడాలని హెచ్చరించారు. లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీడీఎస్ యూ కేయూ ప్రధాన కార్యదర్శి వి.కావ్య, ఉపాధ్యక్షులు పి.అనూష, గణేష్, సహాయ కార్యదర్శులు యాదగిరి, సాధన, నాయకులు లోకేష్, శ్రీజ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటరీ కమిటీ సిఫారసులను అమలు చేయాలి

■ తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) కింద పని చేసే కూలీల కోసం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫారసులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించి అమలుచేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (BKMU)జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. విశేషంగా, ఉపాధి దినాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 100 రోజుల నుంmr150 రోజులకు పెంచాలని, రోజువారీ కూలీని కనీసం రూ.400కి పెంచాలని కమిటీ సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఈ కూలీ కూడా ప్రస్తుత జీవిత ఖర్చులకు సరిపోదని, కనీసం రూ.700 చెల్లించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నా, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దిగ్భ్రాంతికరమన్నారు. అలాగే, వాతావరణ విపత్తులు, కరువుల సమయంలో, అలాగే అడవి ప్రాంతాల్లో నివసించే షెడ్యూల్డ్ తెగల కుటుంబాలకు ప్రతి సంవత్సరం 200 రోజులు ఉపాధి కల్పించాలన్న కమిటీ సిఫారసుల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరి ఆధార్ వివరాల్లో చిన్న పొరపాట్లను చూపి, లక్షలాది మంది కూలీల జాబ్ కార్డులు రద్దు చేయడం అన్యాయమని, అర్హులైన వారందరికీ తిరిగి జాబ్ కార్డులు జారీ చేసి పనులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై కమిటీ చేసిన సిఫారసును ఆయన అభినందించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన పేదల వ్యతిరేక విధానాన్ని విడనడి, ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి, పనులను విస్తరించాలన్నారు. వేతనాలు ప్రతి వారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకాన్ని అమలులోకి తేవాలని కోరారు. ఈ డిమాండ్లను పట్టించుకోకపోతే దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని వెంకట్రాములు హెచ్చరించారు.

# ప్రభుత్వ భూమిని పరిశీలించిన ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ భూముల పరిశీలనతో పాటు, నీరుకుల్ల గ్రామంలో ఇండ్ల మీదుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను షిఫ్ట్ చేసే పనులు ప్రారంభమయ్యాయి. అధికారులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించి, జనావాసాల నుంచి దూరంగా కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. పరకాల నియోజకవర్గంలో ఎస్డీఎఫ్ నిధుల కింద ఇప్పటివరకు రూ. 1.41 కోట్ల (రూ. 1,41,98,000) నిధులు వెచ్చించామని ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల నీరుకుల్లలో కురిసిన అకాల వర్షం వల్ల అన్నదాత ఫర్టిలైజర్ షాపు పైకప్పు ఎగిరిపోవడంతో, షాపు యజమాని అర్షం కుమారస్వామిని కలిసి, ప్రభుత్వ సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నీరుకుల్ల క్రాస్ రోడ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి, ఆ భూమిలో నిరుపేద కుటుంబాలకు 100 గజాల స్థలాలు కేటాయించి, మోడల్ కాలనీగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సునంద సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, మాజీ వైస్ ఎంపీపీ ముద్ద సాంబయ్య, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అర్షం అశోక్, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి కొడేపాక కుమారస్వామి, మాజీ సర్పంచులు పర్వతగిరి రాజు, ఉడుత సంగీత మహేందర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, బరుపట్ల కిరీటి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ అర్షం వరుణ్ గాంధీ, మండల అధికార ప్రతినిధి గఫూర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉడుత రాజేందర్, గ్రామ అధ్యక్షులు కిన్నెర ప్రేమ్చంద్, ఎగితే లింగయ్య, లక్కర్స్ కుమారస్వామి, మండల యువజన అధ్యక్షుడు తనుగుల సందీప్, కాంగ్రెస్ నాయకులు అలువాల రవి శ్రవణ్, ఉప్పుగళ్ల రాజిరెడ్డి, మనగాని రాకేష్, మనగాని సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.




# పాత కథకు కొత్త మెరుగులు

నిర్మాణంలో ఉండగానే చర్చనీయాంశమైన సినిమా 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్‌రామ్ సినిమా అనగానే మాస్ ఆడియన్స్ సినిమాపై ఆసక్తి చూపించడం సాధారణం. ఈ సినిమాలో ఆయనకు సీనియర్ నటి విజయశాంతి కూడా తోడవ్వడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. పైగా తల్లీకొడుకుల నేపథ్య కథాంశంతో రూపొందిన ఈ సినిమాలో విజయశాంతి తనకు బాగా కలిసొచ్చిన పోలీసాఫీసర్ రోల్ చేశారు. కల్యాణ్‌రామ్ పాత్ర అత్యంత శక్తిమంతంగా ఉంటుందని ప్రమోషన్స్‌లో మేకర్స్ తెలియజేశారు. కథలోకి వెళితే.. వైజయంతి (విజయశాంతి) సిన్సియర్ ఐపీఎస్ ఆఫీస్. ఆమెకు ఒక్కకానొక్క కొడుకు అర్జున్ (కల్యాణ్‌రామ్). అర్జున్‌ని ఎలాగైనా ఐపీఎస్ ఆఫీసర్‌గా చూడాలనేది వైజయంతి కల. అందుకు తగ్గట్టే తనను ఐపీఎస్ చదివిస్తుంది. ట్రైనింగ్ కోసం ఢల్లీపంపిస్తుంది. ఏడాది ట్రైనింగ్ పూర్తి చేసుకొని తిరిగిరావాల్సిన అర్జున్.. వెళ్లిన అయిదోరోజే తిరిగి వచ్చేస్తాడు. కారణం తన తండ్రి మరణం. నేవీ అధికారి అయిన తన తండ్రి సముద్రంలో ప్రమాదవశత్తూ మరణించాడని పోలీసులు చెబుతారు. నిజానికి అర్జున్ తండ్రి మరణానికి కారణం ప్రమాదం కాదు.. అదో హత్య. ఆ విషయం తెలుసుకున్న అర్జున్.. తన తండ్రిని చంపిన వ్యక్తులపై పగ తీర్చుకోవాలనుకుంటాడు. కానీ.. అర్జున్‌ని వైజయంతి వారిస్తుంది. చట్టప్రకారం దోషులకు శిక్షపడేలా చేస్తానని, నువ్వు ఐపీఎస్ పూర్తి చేయాలని చెప్పి కొడుకుని మళ్లీ ట్రైనింగ్‌కి పంపించేస్తుంది. ఏడాది తర్వాత అర్జున్ శిక్షణ ముగించుకొని తిరిగొస్తాడు. తన తండ్రి కేసుకు సంబంధించిన జడ్జిమెంట్ ఆరోజే. అర్జున్ తండ్రిది హత్య కాదని, అది ప్రమాదవశత్తే జరిగిందని కోర్టు తీర్పు ఇస్తుంది. హంతకులు కోర్టు నుంచి బయటకొస్తూనే వైజయంతిని అవమానంగా మాట్లాడతారు. అన్యాయం ముందు చట్టం, న్యాయం ఓడిపోవడం కళ్లారా చూస్తాడు అర్జున్. తన కళ్లముందే తల్లిని అవమానిస్తుంటే భరించలేకపోతాడు. అతని కోపం కట్టలు తెంచుకుంటుంది. కోర్టు ఎదురుగానే హంతకుడ్ని కొట్టి చంపేస్తాడు. అంతేకాదు, తన తండ్రి హత్యకు కారణమైన ముఠాలో 41మందిని నరికి చంపేస్తాడు. ఐపీఎస్ కావాల్సిన కొడుకు కంటిముందే హంతకుడుగా మారడం చూసిన వైజయంతి నిశ్చేష్టురాలైపోతుంది. గూండాగా మారిన కొడుకు మీదే యుద్ధానికి సిద్ధమవుతుంది. మరి విధి విడదీసిన ఈ తల్లీబిడ్డలు మళ్లీ ఎలా కలిశారు? ఐపీఎస్ అవ్వాల్సిన అర్జున్ గూండాగా మారి సాధించిందేంటి? అన్నదే సినిమా కథ.భావోద్వేగాలతో కూడిన మాస్ ఎంటర్‌టైనర్ ఇది. దర్శకుడు ప్రదీప్ చిలుకూరి సినిమాను నడిపించిన విధానం బావుంది. హీరోను గూండాగా ఓపెన్ చేసి, తాను అలా మారడానికి గల కారణాన్ని హృద్యంగా చెప్పిన తీరు బావుంది. తండ్రిని చంపిన వారిపై పగతీర్చుకోవడం.. ఈ క్రమంలో కష్టాల్లోవున్న జనాలకు అండగా నిలవడం.. కథలో ప్రధానమైన అంశాలు ఈ రెండు అయితే.. వీటికి తోడు డ్రగ్స్‌ని, మాఫియాని కూడా లింక్ చేశాడు దర్శకుడు. ఒకడ్ని మించిన ఒకడ్ని విలన్‌గా పరిచయం చేసుకుంటూ.. ఒకడి తర్వాత ఒకడ్ని చంపుకుంటూ మొత్తంగా తెరంతా రక్తపాతాన్ని సృష్టించేశాడు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. యాక్షన్ ఎపిసోడ్స్ అన్నీ బావున్నాయి. ఓ దశలో కథలోని ఎమోషన్‌ని యాక్షన్ డామినేట్ చేసిందా అనిపిస్తుంది.





# విజయవాడలో కీర్తి సురేశ్ సందడి

విజయవాడలో టాలీవుడ్ మహానటి కీర్తి సురేశ్ సందడి చేశారు. నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కీర్తి సురేశ్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నటితో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. నేను శైలజా' అనే మూవీతో తెలుగు ప్రేక్షకులని పలకరించింది కీర్తి సురేశ్. ఆ తర్వాత 'మహానటి'తో ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ఈ సినిమాతో జాతీయ ఉత్తమనటిగా అవతరించింది. ఆ తర్వాత తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో వరుస పెట్టి సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం కీర్తి ఓ క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కీర్తి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్‌లో బాలీవుడ్ నటి రాధికా ఆప్టే కీలక పాత్రలో నటించబోతుంది.



# థగ్ లైఫ్ నుంచి ఫస్ట్ సింగిల్

కమల్ హాసన్ హీరోగా ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తోన్న చిత్రం 'థగ్ లైఫ్'. పాన్ ఇండియా స్థాయిలో భారీ తారాగణంతో ఈ చిత్రం రూపొందుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం అందరినీ ఆకట్టు–కుంటోంది. ఈ పాటకు కమల్ హాసన్ లిరిక్స్ అందించారు. ఆయనతో పాటు– శింబు కూడా ఈ పాటలో చిందేశారు. జూన్ 5న ఈ సినిమా విడుదల కానుంది.



# గుడి కావాలంటున్న ఊర్వశి రౌతేలా

వెండితెరపై హీట్ పుట్టించే ఊర్వశి రౌతేలా... ఆఫ్ స్క్రీన్ లో తన నోటి దురదతో వివాదాలు కోరి తెచ్చుకుంటుంది. మొన్నామధ్య తాను నటించిన సినిమా వందకోట్లు రాబట్టింది, కియార నటించిన సినిమా ఫ్లాప్ అయిందని కామెంట్స్ చేసింది. రోజు రోజుకి ఈ బ్యూటీకి పైత్యం పెరిగిపోతుందనే చెప్పాలి. తాజాగా మరోసారి అతిగా అనిపించే కామెంట్స్ చేసింది ఊర్వశి. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ లో మాట్లాడుతూ' నార్త్ ఇండియాలో నా పేరు మీద ఓక గుడి ఉంది. బద్రీనాథ్ టెంపుల్ పక్కన ఉన్నఊర్వశి టెంపుల్ నా కోసం కట్టారు. అలాగే టాలీవుడ్ లో చిరు సీనియాతో ఎంట్రీ ఇచ్చి బ్యాక్ టు బ్యాక్ స్టార్ హీరోల సినిమాలతో నాకు ఫ్యాన్స్ వచ్చారు. నార్త్ లో లాగే నాకు సౌత్ లో కూడా నా ఫ్యాన్స్ గుడికట్టాలని కోరుతున్నాను' అని చెప్తోంది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పైత్యం ఎక్కవైతే ఇంతే ఇలానే మాట్లాడుతారని బాలీవుడ్ బ్యూటీపై నెటిజన్స్ ట్రోలింగ్ చేస్తున్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet


శుక్రవారం, ఏప్రిల్ 18, 2025



# అభినందన సభ అదిరింది

- వనం వెంకటేశ్వరరావుకు ఘన సన్మానం
- పాల్గొన్న ప్రముఖులు, ఉపాధ్యాయులు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** హనుమకొండ జిల్లా శాయంపేట జడ్పీఎస్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వనం వెంకటేశ్వర రావు ఉద్యోగ విరమణ, అభినందన సభ అదిరింది. గురువారం స్థానిక ఎస్వీ కేకే ఫంక్షన్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమం 'నా భూతో.. నా భవిష్యత్' అన్నట్లుగా సాగింది. ఈ నెల 30న వెంకటేశ్వర రావు ఉద్యోగ విరమణ చేయనుండగా, వేసవి సెలవుల దృష్ట్యా ముందస్తుగానే హై స్కూల్ స్టాఫ్ కాగితపు శ్రీనివాస్ అధ్యక్షతన ఆయనకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించింది. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు బ్యాండ్ మేళాలతో స్వాగత గీతం ఆలపిస్తూ వెంకటేశ్వరరావు, ఆయన సతీమణి శైలజను ఊరేగింపుగా వేదిక పైకి తోలుకొని వచ్చారు. విద్యార్థినీలు ప్రత్యేక దుస్తుల్లో నృత్యాలు చేస్తూ పాటలు పాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక సంబరాలు అంబరాన్ని అంటాయి. శాయంపేట హై స్కూల్ ఉపాధ్యాయులు, మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన సహోద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు 'వనం' దంపతులకు నిలువెత్తు పూలదండలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు వివిధ పాఠశాలల్లో పనిచేసి అందరి మన్ననలు పొందిన వెంకటేశ్వర రావును పూలమాలలు, సన్మాన పత్రాలు, బహుమతులు, జ్ఞాపికలతో ముంచెత్తారు. శాలువాలతో సత్కరించి తమ ప్రేమ వాత్సల్యాన్ని ప్రదర్శించారు. వనం వెంకటేశ్వర రావు, శైలజ దంపతుల అభినందన సభ అధ్యంతం షష్టిపూర్తి కార్యక్రమాన్ని తలపించింది. ముఖ్యంగా ప్రముఖ వ్యాఖ్యాత బాలాజీ రవి సందర్భోచిత వ్యాఖ్యానం, పాటలు అందరినీ అలరించాయి. శాయంపేట మండల సీఆర్టీయూ అధ్యక్షుడు రాజ యుగేందర్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రాథోడ్ సభకు నేతృత్వం వహించి అందరినీ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా వరంగల్ వాయిస్





ఎడిటర్ గడ్డం కేశవమూర్తి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ.. ఆపన్న హస్తం అందిస్తున్న ఘనత వెంకటేశ్వర రావుకు దక్కిందని అన్నారు. ఆయన ఏ పాఠశాలలో పనిచేసినా విద్యార్థుల భవిష్యత్తుకు, పాఠశాల అభివృద్ధికి బాటలు వేశారని పేర్కొన్నారు. విధుల పరంగా నిదానమే ప్రధానం అంటూ ముందుకు వెళ్లిన వెంకటేశ్వర రావు అందరికీ ఆదర్శప్రాయుడని పీఆర్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మండల తిరుపతి రెడ్డి, పలిత శ్రీహరి కొనియాడారు. తామంతా ఆయన బాటలోనే నడుస్తామని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. చాలాకాలంగా పెండింగులో ఉన్న ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు వెళ్తామని తెలిపారు. స్నేహశీలి, సహృదయులని రాష్ట్ర పండిత పరిషత్ అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్, టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షులు బాసిరి రాజా బాబురావు, జీహెచ్ఎం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నెహ్రూ, డీసీఈబీ సెక్రటరీ రామ్ ధన్, శాయంపేట మండల విద్యాశాఖ అధికారి గడ్డం భిక్షపతి, డి.మహేందర్ రెడ్డి, కె.రాజిరెడ్డి అన్నారు. నాలుగు దశాబ్దాల అధ్యాపక ప్రస్థానంలో ఎంతోమంది విద్యార్థులను అన్ని విధాల తీర్చి దిద్దిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. సమీప బంధువులు కె.పురుషోత్తం రావు, బుర్ర దామోదర్, డి.శరత్ చంద్ర, జి.శ్రీనివాసరావు, పి.దినకర్, వద్దిరాజు తదితరులు వెంకటేశ్వర రావు–శైలజ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు బి.కుమార్, రమేష్, మాధవి, శ్రీలత, చక్రవర్తుల మధు, రిటైర్డ్ ఎంఈఓ పున్నం యాదవ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు గుండు సదానందం, బాసిరి రాజబాబు, గడ్డ పద్మ, ఉదయశ్రీ, అజీముద్దీన్, సత్య ప్రసాద్, రాజేష్ శర్మ , బండారి మధు, మార్త సురేందర్, మంచు వెంకన్న, నరసింహ రెడ్డి, రాజిరెడ్డి, అన్నపూర్ణ, శారదతోపాటు ఎస్బీఐ చీఫ్ మేనేజర్ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ ను కలిసిన హరి రమాదేవి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వరంగల్ ప్రాంతానికి చెందిన ముఖ్య మహిళా నేత, రాష్ట్ర నాయకురాలు డాక్టర్ హరి రమాదేవి పాల్గొన్నారు. తొలుత కేసీఆర్ తో పాటు కల్వకుంట్ల కవితను వ్యక్తి గతంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రజతోత్సవ సభ ఏర్పాట్ల గురించి, మహిళా రిజర్వేషన్ల అమలు సందర్భంగా మహిళలకు ఆయన మార్గనిర్దేశం చేసారు.





# శాంతియుత సమాజం స్థాపించాలి

- కమ్యూనిటీ పెద్దలు ఆ బాధ్యత తీసుకోవాలి
- హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాజంలో వ్యక్తులు, సమూహాల మధ్య వచ్చే వివాదాలను శాంతియుతంగా పరిష్కరించి శాంతియుతమైన సమాజాన్ని స్థాపించడానికి కమ్యూనిటీ పెద్దలు నడుం బిగించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి ఆయా జిల్లాల న్యాయ సేవ సంస్థలు గుర్తించిన కమ్యూనిటీ మీడియేటర్ల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలను చీఫ్ జస్టిస్ శుక్రవారం ఉదయం హనుమకొండలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఏ వివాదమైనా ఒక వ్యక్తికి వ్యక్తి మధ్యనో లేదా వ్యక్తుల సమూహాల మధ్యనో ఏర్పడుతుందని, అయితే ఆ వ్యక్తి గాని సమూహం గాని ఏదో ఒక కమ్యూనిటీకి చెందిన వారై ఉంటారన్నారు. అటువంటి పరిస్థితిల్లో అదే కమ్యూనిటీకి చెందిన పెద్దవారు వారికి నచ్చచెప్పినట్లయితే వివాదాలు సుహృద్భావ వాతావరణంలో పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ బృహత్తర ఆలోచన నుంచి ఉద్భవించినదే కమ్యూనిటీ మీడియేషన్ విధానమన్నారు. మొదటిసారిగా భారతదేశంలో కేరళ రాష్ట్రంలో ఈ విధానం విజయవంతం అయిందని పేర్కొన్నారు. సమాజంలోని కమ్యూనిటీ పెద్దలు కోర్టుల దాకా రాకుండా వేల సంఖ్యలో వివాదాలను పరిష్కరించారన్నారు. ఆ తరువాత ఈ విధానం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చేరి అక్కడ కూడా విజయవంతమైందన్నారు. అయితే 2023వ సంవత్సరంలో వచ్చిన మీడియేషన్ చట్టం ఈ విధానానికి చట్టబద్ధత కల్పించిందని ఆయన తెలిపారు. ముఖ్యంగా గత కొన్ని దశాబ్దాలుగా భార్యాభర్తల మధ్య తగాదాలు, తల్లిదండ్రులు, పిల్లల మధ్య తగాదాలు సమాజంలో పెరిగిపోతున్నాయని వీటికి చక్కటి పరిష్కారం కమ్యూనిటీ మీడియేషన్ అని జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, ఇంటిలో సర్ది చెప్పే పెద్దలు లేకపోవడం, భార్యాభర్తల మధ్య ఇగోలు ఏర్పడి వారి మధ్య వివాదాలకు ఎక్కువగా కారణం అవుతున్నాయని ఆయన అన్నారు. వివాదాలను సమాజ కమ్యూనిటీ పెద్దలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయస్థానాలలో కేసులు ఉంటే, ఇరుపక్షాలలో ఒకరు గెలిస్తే మరొకరు పైకోర్టుకు వెళ్తారని కానీ కమ్యూనిటీ మీడియేషన్ విధానంలో వివాదం పరిష్కారమైతే వ్యక్తులే కాకుండా కుటుంబాలు కూడా సంతోషంగా ఉంటాయని ఇటువంటి గురుతర బాధ్యతను పెద్దలు తమ భుజస్కంధాల మీద వేసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్.పంచాక్షరి మాట్లాడుతూ నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్ లో ఈ కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లు విజయవంతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. గత ఏప్రిల్ ఏడున కామారెడ్డిలో ఒకేసారి 12 కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు బీవీ నిర్మల గీతాంబ, సీహెచ్ రమేష్ బాబు, ఇతర జిల్లాల న్యాయమూర్తులు, వరంగల్ హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయి కుమార్, క్షమా దేశ్ పాండే తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్లు..

తెలంగాణ రాష్ట్ర తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజోయ్ పాల్ హనుమకొండకు శుక్రవారం విచ్చేయగా వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి.ప్రావీణ్య మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకేను అందించి స్వాగతం పలికారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com